ఆదిలాబాద్ వార్త
మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్
ఆదివారం 28, జూన్ 2026






# ఆర్థిక ఇబ్బందుల్లోనూ హామీల అమలే కాంగ్రెస్ ప్రభుత్వ నిబద్ధత

* రైతులకు సకాలంలో చెల్లింపులు.. పేదలకు ఇందిరమ్మ ఇళ్లతో భరోసా
* కేసీఆర్ చేసిన అప్పులే రాష్ట్రానికి భారంగా మారాయి
* అప్పుల భారం మధ్యే సంక్షేమాన్ని ముందుకు తీసుకెళ్తున్న రేవంత్ ప్రభుత్వం
* ఆదిలాబాద్‌లో ఓటరు అవగాహన సభ.. ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభం
* ఉమ్మడి అదిలాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు

ఆదిలాబాద్, జూన్ 27, ప్రభాతవార్త



బీఆర్ఎస్ నేతలు హరీష్ రావు, కేటీఆర్లు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేసే ముందు గత పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం చేసిన భారీ అప్పుల గురించి ప్రజలకు సమాధానం చెప్పాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓటరు అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నప్పటికీ ఎన్నికల హామీలను అమలు చేస్తూ ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. రైతుల నుంచి వేల కోట్ల రూపాయల విలువైన జొన్నలు, మక్కలను కొనుగోలు చేసి, సకాలంలో రైతుల ఖాతాల్లో నిధులు జమ చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వానిదేనని తెలిపారు. గత ప్రభుత్వం చేసిన అప్పుల వడ్డీలను ప్రతి నెల మిగతా 2లో..

# ఎరువుల దుకాణాలపై వ్యవసాయ శాఖ కొరడా

* 12 డీలర్ల లైసెన్సులు సస్పెన్షన్ * నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు : ఏఓ రామకృష్ణ

కాగజ్‌నగర్ రూరల్, జూన్ 27, ప్రభాతవార్త

రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందేలా చర్యల్లో భాగంగా కాగజ్‌నగర్ మండలంలోని పలు ఎరువుల దుకాణాలపై శనివారం వ్యవసాయ శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జిల్లా వ్యవసాయ శాఖ ఆదేశాల మేరకు వ్యవసాయ అధికారి రామకృష్ణ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేపట్టారు. తనిఖీల సందర్భంగా డీలర్ల వద్ద లైసెన్సులు, స్టాక్ రిజిస్టర్లు, విక్రయ రికార్డులు, సీడ్ స్టాక్ నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. లైసెన్సులు పొందినప్పటికీ వ్యాపారం నిర్వహించని డీలర్ల నుంచి లైసెన్సులను స్వచ్ఛందంగా సరెండర్ చేయించామని ఏవో తెలిపారు. అదేవిధంగా స్టాక్ రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించకపోవడం, విత్తనాల నిల్వలను ఫారం–డి లో నమోదు చేయకపోవడం వంటి నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడిన 12 మంది డీలర్ల లైసెన్సులను సస్పెండ్ చేసినట్లు మిగతా 2లో..





# అర్హత కలిగిన దివ్యాంగులకు మాత్రమే సదరం ధ్రువపత్రాలు

❖ పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్, సెర్ప్ సి.ఈ.ఓ. దివ్య దేవరాజన్

నస్పూర్, జూన్ 27, ప్రభాతవార్త



సదరం యుడిఐడి శిబిరాల నిర్వహణలో అర్హత కలిగిన దివ్యంగులకు మాత్రమే ధ్రువపత్రాలు జారీ చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్, సెర్ప్ సి.ఈ.ఓ. దివ్య దేవరాజన్ అన్నారు. శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సదరం శిబిరాల నిర్వహణ, యుడిఐడి పోర్టల్ పార్ట్ బి వివరాల నమోదు, అటెండెన్స్ మార్కింగ్, దివ్యాంగుల హాజరు, పోర్టల్‌లో వెయిటింగ్ లిస్ట్ ఉన్నవారికి వైద్య శిబిరం అసెస్మెంట్ షెడ్యూల్ కేటాయింపు అంశాలపై జిల్లా అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సి.ఈ.ఓ. మాట్లాడుతూ ప్రతి నెల నిర్వహించే సదరం యుడిఐడి శిబిరాలను పారదర్శకంగా నిర్వహించాలని, అర్హత కలిగిన దివ్యాంగులకు మాత్రమే ధ్రువపత్రాలు జారీ చేయాలని తెలిపారు. పెండింగ్ దరఖాస్తులు లేకుండా పరిష్కరించాలని, ప్రతినెలా తప్పనిసరిగా ప్రత్యేక శిబిరాలు మిగతా 2లో..

# ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ పకడ్బందీగా అమలు చేయాలి

* మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, జూన్ 27, ప్రభాతవార్త

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గల 37, 51, 40 డివిజన్‌లలో ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియను మండల తహసిల్దార్ రఫతుల్లా, మిగతా 2లో..



# బాసరలో వేద ఘోషతో మార్మోగిన సరస్వతీ ఆలయం

భైంసా, జూన్ 27, ప్రభాతవార్త:

నిర్మల్ జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయం శనివారం వేద నాదంతో మార్మోగింది. వేసవి సెలవులు ముగిసి పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో తమ పిల్లలకు అక్షరాభ్యాసాలు చేయించేందుకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రల నుంచి భక్తులు, తల్లిదండ్రులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచే ఆలయంలో ముగ్గురు అమ్మవార్లకు (సరస్వతి, లక్ష్మి, కాళి) ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, అలంకరణ పూజలు వైభవంగా నిర్వహించారు. దేశం నలుమూలల నుంచి వచ్చిన తల్లిదండ్రులు తమ చిన్నారులకు ఆలయ అక్షరాభ్యాస మిగతా 2లో..



## ఆర్థిక ఇబ్బందుల్లోనూ హామీల అమలే కాంగ్రెస్ ప్రభుత్వ నిబద్ధత

(మొదటిపేజీ తరువాయి)

చెల్లించాల్సి వస్తోందని, అయినప్పటికీ సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నామని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం అమరవీరుల త్యాగాలు, సోనియా గాంధీ సహకారంతో ఏర్పడిందని, అలాంటి రాష్ట్రాన్ని గత ప్రభుత్వం అప్పుల ఊబిలోకి నెట్టిందని విమర్శించారు. ఇకనైనా హరీష్ రావు నిరాధార ఆరోపణలు మానుకోవాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్న ఓటర్ల పేర్లను తొలగించేందుకు కొన్ని శక్తులు కుట్రలు చేస్తున్నాయని ఆరోపించిన మంత్రి జూపల్లి, ప్రతి ఓటరు తమ ఓటు వివరాలను పరిశీలించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఓటు కీలకమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అచల్ మహాజన్, డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు, మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, మాజీ చైర్మన్ సంజీవ్ రెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్, మాజీ డీసీసీ చైర్మన్ భోజరెడ్డి, గండ్రత్ సుజాత, మాజీ ఎంపీ సోయం బాపురావు, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష, ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక నాయకులు, లబ్ధిదారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాలపై వ్యవసాయ శాఖ కొరడా

(మొదటిపేజీ తరువాయి)

వెల్లడించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి రామకృష్ణ మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధిక ధరలకు ఎరువులు విక్రయించినా, నిల్వలను దాచిపెట్టి కృత్రిమ కొరత సృష్టించినా, రికార్డుల్లో అవకతవకలు జరిగినా సంబంధిత డీలర్లపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు లైసెన్సులను పూర్తిగా రద్దు చేస్తామని హెచ్చరించారు. రైతులు తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని, ఎలాంటి అక్రమాలు జరిగినా వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ తనిఖీల్లో వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) రెహ్మాన్, ఎరువుల డీలర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## బాసరలో వేద ఘోషతో మార్మోగిన సరస్వతీ ఆలయం

(మొదటిపేజీ తరువాయి)

మండపంలో శాస్త్రోక్తంగా అక్షరాభ్యాస పూజలు జరిపించారు. అనంతరం సుదీర్ఘ క్యూలైన్లలో వేచి ఉండి చదువుల తల్లిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ముఖ్యంగా ఆలయ వేద ఆశీర్వచన మండపంలో వేద పండితులు ఘనపాఠీలుగా మారి వేద మంత్రాలను ఉచ్ఛరిస్తుండగా, వారి శిష్యులు గురువుల పద్ధతిని అనుసరిస్తూ సహపాఠంగా వేదాలను వల్లించడం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. సరస్వతి అమ్మవారు వేద స్వరూపిణి, వాఙ్మయి కావున, ఈ పవిత్ర క్షేత్రంలో వేద పఠన ధ్వనులు వినడం వల్ల చిన్నారుల జ్ఞాపకశక్తి పెరుగుతుందని, వారి నాలుకపై అమ్మవారు నాట్యమాడుతుందని వేద పండితులు వివరించారు. ఈ వేద ధ్వనులతో ఆలయ ప్రాంగణమంతా ఆధ్యాత్మిక శోభతో విరాసిల్లింది. శనివారం సెలవు దినం కావడంతో అమ్మవారి సర్వదర్శనానికి సుమారు గంటన్నర సమయం పడుతోందని ఆలయ అధికారులు వెల్లడించారు. క్షేత్రానికి పోటెత్తిన భక్తులకు, చిన్నారులకు తాగునీరు, నీడ సదుపాయంతో పాటు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి అంజనాదేవి ముందస్తుగా ప్రత్యేక ఏర్పాట్లు చేసి పర్యవేక్షి ంచారు.

## అర్హత కలిగిన దివ్యాంగులకు మాత్రమే సదరం ధ్రువపత్రాలు

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించాలని తెలిపారు. ప్రతినెల మండలానికి ఒక గ్రామం చొప్పున దివ్యాంగుల గుర్తింపు, సదరం ధ్రువపత్రం లేని వారికి మీ సేవలో నమోదు, లోకో మోటర్, ఈ ఎన్ టి, కంటి శిబిరాల నిర్వహణ, బేరా, సౌండ్ ప్రూఫ్ పరికరాల లభ్యత, వినియోగం అంశాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య మాట్లాడుతూ మీసేవ ద్వారా సదరం శిబిరం కొరకు అందిన దరఖాస్తులను క్రమ సంఖ్య వారీగా పరిశీలించి అభ్యర్థులకు వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, వైద్య పరీక్షల నిర్వహణలో ప్రభుత్వ నియమ నిబంధనలను అమలు చేస్తున్నామని, వైద్య పరీక్షలు పారదర్శకంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఎం.ఓ. శ్రీధర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

**చింతలమానేపల్లి, జూన్ 27, ప్రభాతవార్త:**



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

సిర్పూర్ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతర కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు అన్నారు. మండలంలోని 40 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు మంజూరు కాగా బాలాజీ అనుకోడ రైతు వేదికలో లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..సంక్షేమ పథకాలను ప్రతి ఒక్క లబ్ధిదారుడికి నేరుగా అందించడమే లక్ష ్యంగా పని చేస్తున్నామని స్పష్టం చేశారు. కేవలం సంక్షేమమే కాకుండా, నియోజకవర్గ అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నప్పటికీ, గ్రామాల్లో అభివృద్ధి పనులు ఆగిపోకుండా చర్యలు తీసుకుంటున్నామని, కరెంట్ కోతలు లేకుండా 24 గంటల విద్యుత్ సరఫరా, రైతులకు అగ్రికల్చర్ కనెక్షన్లు, ఎన్ ఆర్ జి ఇ ఎస్ పథకంలో సిసి రోడ్లు చేపడుతున్నామని, అలాగే డబుల్ రోడ్ల నిర్మాణంతో ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నామని వెల్లడించారు. మండలంలోని దిందా వంతెన పనులు ముమ్మరంగా సాగుతున్నాయని చెప్పారు. గ్రామాల్లో పూర్తిగా కేంద్ర ప్రభుత్వం ద్వారా వచ్చిన నిధులతోనే అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని వివరించారు. కార్యక్రమంలో తహసిల్దార్ ప్రకాష్ ఎంపీడీవో సత్యనారాయణ డిప్యూటీ తహసిల్దార్ దౌలత్, సీనియర్ అసిస్టెంట్ జాఫర్, ఆయా గ్రామాల సర్పంచులు, నాయకులు ఎలుముల మల్లయ్య, తుకారాం, నవీన్, సాయి, భీమేష్, సత్యయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ పకడ్బందీగా అమలు చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఓటర్లకు అందిస్తున్న ఎన్యుమరేషన్ ఫారాల ప్రక్రియను సమర్థవంతంగా చేపట్టాలని తెలిపారు. జూలై 24వ తేదీ వరకు నిర్వహించే సమగ్ర సవరణ ఇంటింటి కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని, ఈ క్రమంలో బూత్ స్థాయి అధికారులు ఓటర్ల వద్దకు వెళ్లిన సమయంలో ఎన్యుమరేషన్ ఫారం అందించినప్పుడు బిఎల్ఓ యాప్‌లో మార్క్ చేయాలని తెలిపారు. సదరు ఓటరు ఎన్యుమరేషన్ ఫారం నింపిన తరువాత తిరిగి సేకరించి యాప్‌లో వివరాలు నమోదు చేయాలని తెలిపారు. మరణించిన వారు, గ్రామం వదిలి వెళ్ళిన వారు, 2 అంతకు మించి ఎపిక్ కార్డులు కలిగి ఉండడం అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఒకరికి ఒక ఓటరు గుర్తింపు కార్డు మాత్రమే ఉండేలా స్పష్టమైన జాబితా రూపొందించాలని తెలిపారు. ఎన్యుమరేషన్ ఫారాలు నింపిన తరువాత తిరిగి సేకరించి బిఎల్ఓ యాప్ లో ఎలాంటి పొరపాట్లు లేకుండా వివరాలు స్పష్టంగా నమోదు చేయాలని, ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా ప్రక్రియను నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో క్షేత్రస్థాయి పర్యటన

### పారిశుధ్య, అభివృద్ధి పనులను పరిశీలించిన ప్రత్యేక అధికారి, ఎంపీడీవో

**సారంగాపూర్, ప్రభాతవార్త:**



సారంగాపూర్ మండల ప్రత్యేక అధికారి బాలిక్ అహ్మద్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి లక్ష్మీ ్మకాంత్, మండల విద్యాధికారి మహేందర్‌లు శనివారం మండలంలోని పలు గ్రామాల్లో సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పర్యటించారు. మండల పరిధిలోని జాం, కౌట్ల(బి), పొట్య, హనుమాన్ తండా గ్రామాలను సందర్శించి అక్కడ కొనసాగుతున్న వివిధ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పర్యవేక్షించారు. గ్రామాల్లో ముమ్మరంగా సాగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించి, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని దోమలు, వ్యాధులు ప్రబలకుండా మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. అనంతరం ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి, అందులో శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారిన పాత పాఠశాల భవనాలను గుర్తించి, విద్యార్థుల రక్షణార్థం వాటిని తక్షణమే కూల్చివేయించారు. అదేవిధంగా గ్రామాల్లో నూతనంగా నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల భవన నిర్మాణ పనులను వారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్‌లతో మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల ప్రకారం భవన నిర్మాణంలో సరైన నాణ్యతా ప్రమాణాలను పాటిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. వీటితో పాటు గ్రామాల్లోని అంగన్‌వాడీ భవనాల స్థితిగతులను, ఇతర స్థానిక అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. పనులన్నీ త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ క్షేత్రస్థాయి పర్యటనలో స్థానిక సర్పంచులు బల్గూరి అజయ్ రావు, కరిపే రవళి విలాస్, పవార్ పుష్పలత, జాదవ్ కైలాస్, ఉపసర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు శివరత్నం, వివిధ శాఖల అధికారులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ఏరియా ఉత్పత్తి, ఉత్పాదకతలో వర్క్‌షాప్ పాత్ర కీలకం

### శ్రీరాంపూర్ జీఎం మునిగంటి శ్రీనివాస్

### శ్రీరాంపూర్ ఏరియా వర్క్‌షాప్‌లో 12 టన్నుల నూతన క్రేన్ ప్రారంభం

**నస్పూర్, ప్రభాతవార్త**

శ్రీరాంపూర్ ఏరియా బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతలో ఏరియా వర్క్‌షాప్ పాత్ర కూడా ఎంతో కీలకమని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం ఏరియా వర్క్‌షాప్‌లో నూతనంగా అందుబాటులోకి తెచ్చిన 12 టన్నుల క్రేన్ పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొని, రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ అన్ని భూగర్భ, ఉపరితల గనులకు అవసరమైన యంత్రాల నిర్వహణ, మరమ్మతులు సక్రమంగా జరగాలని సూచించారు. ఎలాంటి తాత్సారం లేకుండా సకాలంలో సంబంధిత గనులకు యంత్రాలను అందుబాటులోకి తెచ్చేలా ప్రతి ఒక్కరు నిబద్ధతతో కృషి చేయాలని వర్క్‌షాప్ అధికారులు, ఉద్యోగులను కోరారు. నూతనంగా అందుబాటులోకి తెచ్చిన ఈ క్రేన్‌తో పాటు ఇతర భారీ వాహనాలు, యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని మునిగంటి శ్రీనివాస్ సూచించారు. యంత్రాల పనిగంటలను పెంచి సంస్థ అభ్యున్నతికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్‌తో పాటు ఎస్ఓటు జీఎం ఎన్. సత్యనారాయణ, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, డీజీఎం (వర్క్‌షాప్) కృష్ణారెడ్డి, డీవై సీఎంఓ రమేష్ బాబు, పిట్ సెక్రటరీ సదానందం, సంక్షేమ అధికారి రమేష్ నాయక్, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## బెల్లంపల్లిలో గిరిజన హైస్కూల్, ఆశ్రమ పాఠశాలకు భవనం మంజూరు చేయాలి

### ఐటీడీఏ పీఓకు వినతి పత్రం అందజేత

**బెల్లంపల్లి, జూన్ 27, ప్రభాతవార్త**




బెల్లంపల్లి పట్టణానికి గిరిజన సంక్షేమ హైస్కూల్‌ను ఏర్పాటు చేయడంతో పాటు, ప్రస్తుతం కొనసాగుతున్న గిరిజన ఆశ్రమ పాఠశాలకు నూతన భవనం మంజూరు చేయాలని కోరుతూ ఆదివాసీ కొలవార్ సంక్షేమ సంఘం జిల్లా కమిటీ ప్రతినిధులు ఐటీడీఏ పీఓ మంద మకరంద్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. శనివారం ఊట్నూరులో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు మద్దిగ రవీందర్, నాయకులు గడ్డం మణికుమార్, యాపల సమ్మయ్య, గోలిశెట్టి బాపు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బెల్లంపల్లి పట్టణంలోని వైటీసీలో కొనసాగుతున్న గిరిజన ఆశ్రమ పాఠశాలకు సొంత భవనం లేకపోవడంతో విద్యార్థులు ఇరుకైన గదుల్లో చదువుకుంటూ ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. 2019లో కన్నాల జాతీయ రహదారి సమీపంలో ఐదు ఎకరాల భూమిని రెవెన్యూ శాఖ కేటాయించినప్పటికీ, ఇప్పటివరకు భూమి స్వాధీన పత్రాలు ఇవ్వలేదని తెలిపారు. ఆ భూమి హస్తాంతరణకు చర్యలు తీసుకోవాలని పీఓను కోరారు. అదేవిధంగా బెల్లంపల్లి నియోజకవర్గంలో గిరిజన సంక్షేమ శాఖకు చెందిన హైస్కూల్ లేకపోవడంతో పేద గిరిజన విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే గిరిజన హైస్కూల్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వారి వినతిపై ఐటీడీఏ పీఓ సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అరికిల్ల శంకర్, టెకం రాజయ్య, కోయ రాజం, ఊరటి పవన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సంఖ్య పెంపొందించాలి

**- మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా విద్యాశాఖ అధికారి పి.చంద్రయ్య**

**నస్పూర్, జూన్ 27, ప్రభాతవార్త**



అన్ని ప్రభుత్వ పాఠశాలలలో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించి ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సంఖ్య పెంపొందించాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా విద్యాశాఖ అధికారి పి.చంద్రయ్య అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో అన్ని మండలాల విద్యాశాఖ అధికారులు, ఆదర్శ పాఠశాలల ప్రిన్సిపాళ్ళు, యుఆర్ఎస్ టిజిఆర్ఐఈ, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల ప్రత్యేక అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి పాఠశాల నుంచి అడ్మిషన్లను నమోదు చేయాలని, ఉపాధ్యాయులు, విద్యార్థుల ఎఫ్ ఆర్ ఎస్ హాజరు100 శాతం నమోదు ఉండాలని, ప్రభుత్వ పాఠశాలలలో వసతులు పెరిగినందున విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేసి పాఠశాలలో నమోదు సంఖ్యను పెంపొందించాలని తెలిపారు. పాఠశాలలలో నమోదైన ప్రతి విద్యార్థికి అపార్ జనరేట్ చేయాలని, ప్రతి విద్యార్థికి ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు అందించామని, త్వరలోనే 2 జతల యూనిఫామ్స్ అందించడం జరుగుతుందని తెలిపారు. మండల విద్యాధికారులు ప్రైవేటు పాఠశాలను తనిఖీ చేయాలని, జీరో ఎన్రోల్మెంట్ పాఠశాలలు 4 పున: ప్రారంభించామని, ప్రీ ప్రైమరీ పాఠశాలలకు త్వరలోనే ఇన్స్ట్రక్టర్లను నియమిస్తామని, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలలో 100 శాతం నమోదు ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని తెలిపారు. విద్యార్థులను యుడైస్ ప్లస్‌లో నమోదు చేయాలని, ప్రభుత్వం విద్యారంగంలో కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొన, ఉన్నత చదువులు అభ్యసించేలా విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అదనపు సంచాలకులు లలిత, సెక్టోరియల్ అధికారులు ఎం.భరత్ కుమార్, కె.కృష్ణమూర్తి, జై సత్తయ్య, కె విజయలక్ష్మి, ఏ రాజ్ కుమార్, అన్ని మండలాల విద్యాధికారులు, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.



## బెల్లంపల్లి మార్కెట్ కమిటీకి కొత్త నాయకత్వం ప్రమాణస్వీకారం

**బెల్లంపల్లి, జూన్ 27, ప్రభాతవార్త**

బెల్లంపల్లి నియోజకవర్గం బెల్లంపల్లి పట్టణంలో మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ఈరోజు ఘనంగా ప్రమాణస్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ సహకారంతో మార్కెట్ కమిటీ చైర్మన్‌గా రత్నం సుకుమారి, వైస్ చైర్మన్‌గా సంగర్సు రవీందర్ రావు, పాలకవర్గం డైరెక్టర్లు ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ హాజరయ్యారు. అలాగే డీసీసీ అధ్యక్షులు పిన్నింటి రఘునాథ్ రెడ్డి, బెల్లంపల్లి మున్సిపల్ చైర్మన్ దావ స్వాతి రమేష్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి మార్కెట్ కమిటీ చైర్మన్ రత్నం సుకుమారిని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మత్తమారి సూరిబాబు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కార్కూరి రాంచందర్, పట్టణ అధ్యక్షులు, ముఖ్య కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో ఏకైక మహిళా జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డు పంపిణీ

**ఆసిఫాబాద్ టౌన్, జూన్ 27, ప్రభాతవార్త**



జిల్లాలో ఏకైక మహిళా జర్నలిస్టుగా సేవలందిస్తున్న వార్త దినపత్రిక జిల్లా స్టాఫ్ రిపోర్టర్ పాత్రికేయురాలు భూక్య గిరిజకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన అక్రిడిటేషన్ కార్డును అధికారులు, ప్రజాప్రతినిధులు అందజేశారు. శనివారం కలెక్టరేట్ లో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇంచార్జి శ్యామ్ నాయక్, ఏఎంసి చైర్మన్ మంగ కలిసి మహిళా పాత్రికేయురాలుకు కార్డు పంపిణి చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్రికా రంగంలో మహిళల భాగస్వామ్యం పెరుగుతున్న నేపథ్యంలో జిల్లాలో ఏకైక మహిళా జర్నలిస్టుగా అక్రిడిటేషన్ కార్డు పొందడం విశేషమని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో, వార్తలను నిష్పక్షపాతంగా ప్రజలకు చేరవేయడంలో ఆమె చేస్తున్న కృషిని కొనియాడారు. ఈ సందర్భంగా మహిళా జర్నలిస్టు మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలుపుతూ భవిష్యత్తులో కూడా ప్రజల సమస్యలను ప్రతిబింబించేలా బాధ్యతాయుతమైన జర్నలిజాన్ని కొనసాగిస్తానని తెలిపారు.



## అభివృద్ధి పనుల పురోగతిపై ఎంపీడీవో సమీక్ష

**వేమనపల్లి, జూన్ 27, ప్రభాతవార్త**

వేమనపల్లి మండల కార్యాలయంలో శనివారం ఎంపీడీవో కుమారస్వామి అధ్యక్షతన వారాంతపు సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలోని గ్రామ పంచాయతీల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షిస్తూ పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. వీఓ భవనాలు, కాంపౌండ్ వాల్స్, కిచెన్ షెడ్లు, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన మస్టర్ చెల్లింపులు సకాలంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నర్సరీల్లోని మొక్కలను నాటేందుకు సిద్ధం చేయడంతో పాటు ఇందిరమ్మ ఇళ్లు, ఎస్‌బీఎం-ఐహెచ్‌హెచ్‌ఎల్ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. తాగునీరు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా ఈ నెలాఖరులోపు పిట్ డిగ్గింగ్ పూర్తి చేసి ఫొటోలు సమర్పించాలని క్షేత్ర సహాయకులకు సూచించారు. సమావేశంలో ఎంపీఓ వెంకటేష్, ఏపీఓ, హౌసింగ్ ఏఈ, పంచాయతీ కార్యదర్శులు, సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.



## ఎస్సై చేతుల మీదుగా ట్రైనింగ్ ఇన్స్టిట్యూషన్ ప్రారంభం

**జన్నారం, జూన్ 27, ప్రభాతవార్త**

జన్నారం మండల మండల కేంద్రంలో శ్రీ సాయి ట్రైనింగ్ ఇన్స్టిట్యూషన్‌ను శనివారం నాడు జన్నారం ఎస్సై ఉదయ్ కిరణ్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై ఉదయ్ కిరణ్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ యజమాని ఆడేపు లక్ష్మీనారాయణ, వారి కుమారుడు సాయికిరణ్‌కు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మండలంలోని విద్యార్థిని విద్యార్థులకు వారి ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ ఆధ్వర్యంలో స్థానిక, పరిసర మండలాల విద్యార్థిని విద్యార్థులు శిక్షణ పొంది నైపుణ్యత సాధించాలని ఎస్సై పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పొనకల్ మాజీ సర్పంచ్ జక్కు భూమేష్, పొనకల్ ఉపసర్పంచ్ అప్పాల జలపతి, బీసీ నాయకులు కోదూరి చంద్రయ్య, కడార్ల నరసయ్య, కాంగ్రెస్ నాయకులు ముజఫర్ అలీ ఖాన్, బిజెపి మండల అధ్యక్షుడు జి. మధుసూదన్ రావు, బీఆర్ఎస్ నాయకులు సిటీ మల్ల భరత్, బాలసాని శ్రీనివాస్ గౌడ్, బేసిక్స్ రాజు, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గాజుల లింగన్న, రిపోర్టర్ కందుల రమేష్, జాడి వెంకట్, పద్మశాలి పట్టణ సంఘం అధ్యక్షుడు చెట్పల్లి కృష్ణ, బాలిన మధు, తాళ్లపల్లి రాజేశ్వర్, కొండకూరు ప్రభాస్, బొట్ల సంజీవ్, తోకల విశేష, జక్కుల సురేష్, లసెట్టి సత్యనారాయణ, ఎస్. గోపాల్, రాంపూర్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ కాలనీలో నూతన బోర్ ఏర్పాటు

**పెంచికల్‌పేట్, జూన్ 27, ప్రభాతవార్త :**

పెంచికల్‌పేట్ గ్రామపంచాయతీ పరిధిలోని బీసీ కాలనీలో త్రాగునీటి సమస్యను దృష్టిలో ఉంచుకొని గ్రామ సర్పంచ్ షేక్ ఉస్మాన్ ఆధ్వర్యంలో శనివారం నూతన బోర్ వేయించారు. దీంతో కాలానీవాసులకు త్రాగునీటి ఇబ్బందులు తొలగానున్నాయి. ఈ సందర్భంగా కాలానీవాసులు మాట్లాడుతూ, ప్రజల అవసరాలను గుర్తించి వెంటనే స్పందించి బోర్ ఏర్పాటు చేయించిన సర్పంచ్ ఉస్మాన్ కు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు గ్రామపంచాయతీ కృషి చేస్తోందని సర్పంచ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలానీవాసులు పాల్గొన్నారు.



## నేడే పల్స్ పోలియో కార్యక్రమం

**- చెన్నూరు మండల వ్యాప్తంగా 40 బూతుల్లో కార్యక్రమ ఏర్పాట్లు**

**- పసిపిల్లల నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు వేయించండి**

**- డా. కృష్ణతేజ పీహెచ్‌సీ అంగ్రాజుపల్లి**

**చెన్నూరు, జూన్ 27, ప్రభాతవార్త**



పసి పిల్లల నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు వేయించి పోలియో మహమ్మారి నుంచి పిల్లలను కాపాడాలని డాక్టర్ కృష్ణ తేజ అన్నారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు మండల వ్యాప్తంగా 39 బూతులు ఏర్పాటు చేశామని, బస్టాండ్ ట్రాన్సిట్ పాయింట్ ను కలుపుకొని 40 కేంద్రాల్లో పోలియో చుక్కల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొంటారని తెలిపారు. అప్పుడే పుట్టిన పిల్లల నుంచి 5 సంవత్సరాల పిల్లలందరినీ ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పల్స్ పోలియో కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. జూన్ 29, 30 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి మిగిలిపోయిన చిన్నారులకు పోలియో డ్రాప్స్ వేస్తామని పేర్కొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే

**హాజీపూర్, జూన్ 27, ప్రభాతవార్త**



మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 16వ డివిజన్ (ముల్కల్ల)లో ప్రభుత్వ పాఠశాలను ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తరగతి గదులను పరిశీలించారు. ఉపాధ్యాయులతో, విద్యార్థులతో మాట్లాడగా మంచినీరు సమస్య ఉందని చెప్పగానే ఎమ్మెల్యే వెంటనే స్పందించి సంబంధిత అధికారికి ఫోన్ చేసి మాట్లాడి వెంటనే పాఠశాలలో ఉన్న మంచినీరు సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి తరగతి గదుల్లో కుర్చీలు, బెంచీలు ఇతర అవసరాలు ఏమున్నా కూడా మూడు నెలలలోపు చేస్తానని ఉపాధ్యాయులకు, విద్యార్థులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మూతపడిన ఎస్సీ బాలుర వసతి గృహాన్ని వెంటనే పునఃప్రారంభించాలి

## - ఛాత్ర యువ సంఘర్ష సమితి



సమావేశంలో మాట్లాడుతున్న ఛాత్ర యువ సంఘర్ష సమితి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శీతల్కర్ అరవింద్

**భైంసా, జూన్ 27, ప్రభాతవార్త:**

నిర్మల్ జిల్లా కుంటాల మండల కేంద్రంలో గతంలో విజయవంతంగా నడిచిన ఎస్సీ సంక్షేమ శాఖ బాలుర వసతి గృహాన్ని (హాస్టల్) అధికారుల నిరక్ష్యం నిర్లిప్త వైఖరి కారణంగా మూసివేయడం అత్యంత బాధాకరమని ఛాత్ర యువ సంఘర్ష సమితి (సీవైఎస్ఎస్) జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శీతల్కర్ అరవింద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుంటాల మండల కేంద్రంలో ప్రభుత్వ మోడల్ స్కూల్‌తో పాటు పలు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు ఉండటంతో ప్రతి సంవత్సరం వందలాది మంది బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు విద్యాభ్యాసం కోసం ఇక్కడికి వస్తుంటారని గుర్తు చేశారు. అయితే ఎస్సీ సంక్షేమ శాఖ హాస్టల్ మూతపడటం వల్ల సుదూర ప్రాంతాల నుండి వచ్చే పేద విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సరైన వసతి సౌకర్యాలు లేక అనేక మంది విద్యార్థులు చదువును మధ్యలోనే మానేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని, మరికొందరు ఆర్థిక భారం మోస్తూ ఇతర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రస్తుతం మండల కేంద్రంలో అందుబాటులో ఉన్న బీసీ హాస్టల్‌లోనూ సీట్లు పూర్తిగా నిండిపోయాయని అధికారులు చెబుతున్నారని, అక్కడ కేవలం 100 మంది విద్యార్థులకు మాత్రమే అవకాశం ఉండటంతో మిగిలిన విద్యార్థులు వసతి కోసం అల్లాడుతున్నారని తెలిపారు. దీంతో పేద కుటుంబాలకు చెందిన విద్యార్థుల విద్యా హక్కు ప్రమాదంలో పడుతోందని విమర్శించారు. గతంలో సక్రమంగా నడిచిన ఎస్సీ సంక్షేమ హాస్టల్‌ను "విద్యార్థులు రావడం లేదు" అనే సాకుతో మూసివేయడం పూర్తిగా వాస్తవ విరుద్ధమన్నారు. హాస్టల్ నిర్వహణలో అధికారులు చూపిన నిరక్ష్యాన్ని కప్పిపుచ్చుకునేందుకే ఇలాంటి కుంటిసాకులు వెతుకుతున్నారని మండిపడ్డారు. ప్రస్తుతం వసతి గృహాన్ని తెరిస్తే వందలాది మంది పేద విద్యార్థులు ప్రయోజనం పొందే అవకాశం ఉందన్నారు. అందువల్ల జిల్లా కలెక్టర్, ఎస్సీ సంక్షేమ శాఖ జిల్లా అధికారులు వెంటనే స్పందించి కుంటాల మండల కేంద్రంలోని ఎస్సీ సంక్షేమ శాఖ బాలుర వసతి గృహాన్ని పునఃప్రారంభించాలని డిమాండ్ చేశారు. హాస్టల్‌కు అవసరమైన సిబ్బందిని నియమించి, మౌలిక వసతులు కల్పించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. లేనిపక్షంలో ఛాత్ర యువ సంఘర్ష సమితి ఆధ్వర్యంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు, ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. పేద విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడే అధికారుల వైఖరిని ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని స్పష్టం చేశారు.



## తేజాపూర్ గ్రామంలో ఘనంగా మొహర్రం వేడుకలు

### - మతసామరస్యానికి ప్రతీక

**నేరడిగొండ, జూన్ 27, ప్రభాతవార్త:**

మండలంలోని తేజాపూర్ గ్రామంలో మొహర్రం (పీర్ల పండుగ) వేడుకలు శనివారం అత్యంత వైభవంగా జరిగాయి. హిందూ, ముస్లింలు అనే తేడా లేకుండా గ్రామ ప్రజలందరూ కులమతాలకు అతీతంగా ఈ వేడుకలలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.గ్రామంలో ప్రతి ఏటా సాంప్రదాయబద్ధంగా నిర్వహించే ఈ పండుగను పురస్కరించుకుని, పీర్లను ప్రత్యేకంగా అలంకరించి ముఖ్యా వీధుల గుండా ఊరేగించారు. భక్తులు పీర్ల స్వాములకు చక్కెర, మలిద ప్రసాదాలను సమర్పించి, తమ మొక్కులను చెల్లించుకున్నారు. గ్రామస్థులు ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకుంటూ మతసామరస్యాన్ని చాటారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## నేడే పల్స్ పోలియో

**ఆసిఫాబాద్, జూన్ 27, ప్రభాతవార్త :**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా రాజంపేట గ్రామపంచాయతీ పరిధిలోని కొత్త రాజంపేట అంగన్‌వాడీ కేంద్రంలో జూన్ 28న నిర్వహించనున్న పల్స్ పోలియో చుక్కల కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారని సర్పంచ్ పోచయ్య, వార్డు సభ్యులు జావీద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అదివారం ఉదయం 7 గంటలకు నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంలో 0-5 సంవత్సరాల లోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించడం ద్వారా పోలియో రహిత సమాజ నిర్మాణంలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు.

## షీ టీం సేవలపై విద్యార్థులకు అవగాహన

**ఆసిఫాబాద్, జూన్ 27, ప్రభాతవార్త :**

షీ టీం ద్వారా అందుతున్న సేవలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. శనివారం కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నితికా పంత్ ఆదేశాల మేరకు ఆసిఫాబాద్ పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా షీ టీం సభ్యులు విద్యార్థులకు పలు కీలక అంశాలపై అవగాహన కల్పించడంతో పాటు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రేరణాత్మక తరగతులు నిర్వహించి ప్రాధాన్యతను వివరించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. అదేవిధంగా సోషల్ మీడియాలో వ్యక్తిగత ఫోటోలు పోస్ట్ చేయవద్దని, ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్ వంటి మాధ్యమాల దుష్ప్రభావాలను వివరించారు. సోషల్ మీడియా కారణంగా కలిగే మానసిక ఒత్తిడితో చదువు సన్నగిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏవైనా ఇబ్బందులు ఎదురైతే ఆసిఫాబాద్ షీ టీం ఫోన్ నంబర్ 8712670564 కు సమాచారం అందించాలని విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో షీ టీం ఇంచార్జ్ బిక్కులాల్, సిబ్బంది స్వప్న, వరలక్ష్మి, దినేష్ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న షీ టీం సభ్యులు



## పీహెచ్‌సిని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి నరేందర్ రాథోడ్

**హాజీపూర్, జూన్ 27, ప్రభాతవార్త**

హాజీపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి నరేందర్ రాథోడ్ ఆకస్మికంగా సందర్శించి తగు సూచనలు చేశారు. ముఖ్యంగా పల్స్ పోలియో కార్యక్రమంలో తీసుకుంటున్న ముందస్తు చర్యలను పరిశీలించారు.అదే విధంగా మాత శిశు సంరక్షణ కార్యక్రమాలలో భాగంగా వంద శాతం గర్భవతుల నమోదు, వైద్యాధికారి ద్వారా పరీక్షలు మాతా శిశు సంరక్షణ కార్డులో వివరముల నమోదు సాధారణ ప్రసవాలపైన అవగాహన కలిగించడం ప్రభుత్వాసుపత్రుల్లో పసవాలు చేయించడం హై రిస్క్ గర్భవతుల వివరాలు నమోదు చేయాలని పరీక్షలు చేయించాలని ఆదేశించారు. ఇన్ పేషెంట్‌గా అందిస్తున్న రోగుల వివరాలు తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు.అదేవిధంగా క్షయ వ్యాధి నియంత్రణలో భాగంగా కేసులను గుర్తించడం, నమోదు చేయడం మందులు అందజేయడం పోషకాహారం కోసం కిట్టులను అందజేయడం చేయాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరూ ఆ మండల పరిధిలోని వీఐపీలు ఎన్జీవోలు ఇతర ఉద్యోగస్తులు క్షయ వ్యాధితో బాధపడుతున్న వారిని పోషకాహారం కోసం సాయం చేయడానికి పోషకాహార కిట్టు ల కోసం అవగాహన కలిగించాలని, అసంక్రమణ వ్యాధులు బీపీ, షుగర్ క్యాన్సర్ లాంటివి నమోదు చేయడం వ్యాధిగ్రస్తులను గుర్తించడం పోర్టల్ లో నమోదు చేయడం చేయాలని 100 శాతం లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రత్యక్షంగా వివరములను నమోదు చేసి చూపించారు. అదేవిధంగా ఆశ ఆరోగ్య కార్యకర్తలతో సమీక్ష చేయడం ఈ ఔషధ ద్వారా అందిస్తున్న మందుల వివరాలు తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రక్త మూత్ర పరీక్షలు తెలంగాణ డయాగ్నోస్టిక్స్‌కు పంపించడం మిగితావి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేయడం మలేరియా డెంగ్యూ హెచ్ఐవి కిట్లు అందుబాటులో ఉంచుకోవడం చేయాలని ఆదేశించారు. వర్షాలు వస్తున్నందున మందులు అందుబాటులో ఉంచాలని గ్రామ పంచాయతీ మున్సిపల్ సిబ్బంది సహకారంతో చర్యలు చేపట్టాలన్నారు.ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ లహరి, ఆరోగ్య పర్యవేక్షకులు పద్మ, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్కా వెంకటేశ్వర్, ఆరోగ్య శాఖ సిబ్బంది సత్యనారాయణ, ఆశ ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## అక్రిడిటేషన్‌లో ఎస్సీ, ఎస్టీలపై వివక్ష: కుంటోల్ల వెంకటస్వామి

**నిర్మల్, జూన్ 27, ప్రభాతవార్త:**

రాష్ట్రంలో అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డుల మంజూరు ప్రక్రియలో దళిత, గిరిజన విలేకరుల పట్ల తీవ్ర వివక్ష చూపుతున్నారని, దీనిని నిరసిస్తూ ఈ నెల 29న హైదరాబాద్‌లోని సమాచార, పౌర సంబంధాల శాఖ (ఐఅండ్‌పీఆర్) కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్టు అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కుంటోల్ల వెంకటస్వామి తెలిపారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవనంలో శనివారం నిర్వహించిన సంఘ జిల్లా కమిటీ సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర, జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కమిటీలలో ఇతర సామాజిక వర్గాల ఆధిపత్యం కొనసాగిస్తూ, క్షేత్రస్థాయిలో కష్టపడుతున్న దళిత, గిరిజన జర్నలిస్టులను కావాలనే పక్కన పెడుతున్నారని మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నుండి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వరకు మారిన పాలనలోనూ దళిత, గిరిజన జర్నలిస్టులకు నిరంతరం అన్యాయం జరుగుతూనే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టులందరికీ ఎలాంటి కొర్రీలు పెట్టకుండా వెంటనే అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అక్రిడిటేషన్ కమిటీల్లో దళిత, గిరిజన ప్రతినిధులకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు వంటి రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టుల పిల్లలకు వంద శాతం ఫీజు రాయితీ వర్తింపజేసి ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ నెల 29న హైదరాబాద్‌లో చేపట్టే ఐఅండ్‌పీఆర్ కమిషనరేట్ ముట్టడి కార్యక్రమంలో నిర్మల్ జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండలాల నుండి దళిత, గిరిజన జర్నలిస్టులు, సామాజికవాదులు, బహుజన సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని వెంకటస్వామి పిలుపునిచ్చారు. ఈ ముట్టడి కార్యక్రమానికి పలువురు న్యాయవాదులు సైతం తమ పూర్తి మద్దతు ప్రకటించారు. ఈ సమావేశంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కొండ రవి, ఉపాధ్యక్షులు దాస మల్లభాస్కర్, ప్రధాన కార్యదర్శి వాగుమారే కపిల్, కోశాధికారి కడుగొల్ల లచ్చిరాం, సలహాదారులు కరెండే గంగాధర్, న్యాయ సలహాదారులు ఆర్. రత్నం రావ్, న్యాయవాది తిరుక్కోవెల సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించిన డీఐఈఓ జాదవ్ పరశురాం

**సారంగాపూర్, జూన్ 27, ప్రభాతవార్త:**



సారంగాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి జాదవ్ పరశురాం శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన నేరుగా తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు. వారి విద్యాభ్యాసం, కళాశాలలో అందుతున్న వసతులు, బోధనా తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ కందూర్ శంకర్‌తో పాటు అధ్యాపక బృందంతో డీఐఈఓ ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాలను పెంచడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరే విద్యార్థుల సంఖ్యను గణనీయంగా పెంచేందుకు చొరవ చూపాలని సూచించారు. విద్యార్థులను ఆకట్టుకునేలా వినూత్న బోధనా పద్ధతులను అవలంబిస్తూ, ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రణాళికాబద్ధంగా నాణ్యమైన విద్యను అందించాలని కోరారు. కార్పొరేట్ కాలేజీలకు ఏమాత్రం తీసిపోని విధంగా విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తూ ఐఐటీ, నీట్ వంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించేలా తీర్చిదిద్దాలని అధ్యాపకులకు దిశా నిర్దేశం చేశారు. కళాశాలలో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు ఫేస్ రికగ్నైజేషన్ విధానాన్ని తప్పనిసరిగా అమలు చేయాలన్నారు.

ప్రతి విద్యార్థి క్రమం తప్పకుండా ప్రతిరోజూ కళాశాలకు హాజరయ్యేలా ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రభుత్వం ప్రవేశపెడుతున్న నూతన విద్యా సంస్కరణలను విజయవంతం చేసేందుకు విద్యాశాఖ సిబ్బంది ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల లెక్చరర్లు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



## జగన్నాథ స్వామి ఆలయంలో డీసీపీ ప్రత్యేక పూజలు

**చెన్నూరు, జూన్ 27, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా స్థానిక చెన్నూరు పట్టణంలోని జగన్నాథ స్వామి ఆలయంలో మంచిర్యాల డీసీపీ భాస్కర్ తన సతీమణితో కలిసి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు దామెర మోహనాచార్యులు జగన్నాథ స్వామికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి డీసీపీ దంపతులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు డీసీపీ భాస్కర్‌ను శాలువాతో సన్మానించి స్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసు అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




## ప్యారమూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించిన ప్రత్యేక అధికారి మహేందర్

**సారంగాపూర్, జూన్ 27, ప్రభాతవార్త:**

సారంగాపూర్ మండలంలోని ప్యారమూర్ గ్రామంలో ప్రభుత్వం నియమించిన ప్రత్యేక అధికారి మహేందర్ శనివారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియను, దరఖాస్తు చేసుకున్న అర్హులైన లబ్ధిదారుల వివరాలను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మహేందర్ మాట్లాడుతూ.. మొదటి విడతలో ఇందిరమ్మ ఇల్లు రాలేదని ఎవరూ ఆందోళన చెందవద్దని, అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం దశలవారీగా ఇళ్లను మంజూరు చేస్తుందని తెలిపారు. నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకున్న ప్రతి లబ్ధిదారునికి ఖచ్చితంగా ఇందిరమ్మ ఇల్లు వస్తుందని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా నిజమైన అర్హులను గుర్తించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్యారమూర్ గ్రామ సర్పంచ్ మాకునూరు వరలక్ష్మి ‍ ‍ ‍ ‍ ‍ ‍ ‍ ‍ ్మ, స్థానిక నాయకులు సాయన్న, పంచాయతీ కార్యదర్శి మహేందర్ సింగ్, వార్డు సభ్యులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

## జాం గ్రామంలో సీసీ రోడ్లను ప్రారంభించిన సర్పంచ్ కరిపే రవళి విలాస్

**సారంగాపూర్, జూన్ 27, ప్రభాతవార్త:**



సారంగాపూర్ మండలంలోని జాం గ్రామంలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను గ్రామ సర్పంచ్ కరిపే రవళి విలాస్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా ప్రభుత్వం సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసిందన్నారు. ఈ నిధులతో గ్రామంలోని ప్రజల అవసరాలు, కోరిక మేరకు అంతర్గత వీధుల్లో ఎక్కడైతే బురద, గుంతలతో ఇబ్బందులు ఉన్నాయో, ఆయా ప్రదేశాలలో ప్రాధాన్యత క్రమంలో సీసీ రోడ్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. నాణ్యతా ప్రమాణాలతో చేపడుతున్న ఈ రోడ్ల నిర్మాణ పనులకు గ్రామ ప్రజలందరూ పూర్తి స్థాయిలో సహకరించాలని కోరారు. రాబోయే రోజుల్లో గ్రామాన్ని అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

**తాండూర్, జూన్ 27, ప్రభాతవార్త :**




మండలంలో ఆదివారం నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఝాన్సీ రాణి కోరారు. మండలంలో 05 సంవత్సరాల లోపు వయస్సు గల 2723 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని లక్ష్యమన్నారు. ఇందుకోసం రెండు రూట్లు, 21 పల్స్ పోలియో కేంద్రాలు ఏర్పాటు చేశామని, 84 మంది సిబ్బందిని నియమించామని తెలిపారు. ఆదివారం పోలియో చుక్కలు వేయించుకొని చిన్నారులకు సోమ, మంగళ వారం రెండు రోజులు సిబ్బంది ఇంటింటికి వెళ్లి అర్హులైన చిన్నారుల పోలియో చుక్కల మందు వేస్తారని ఆమె తెలిపారు. ఈ అవకాశాన్ని చిన్నారుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకొని పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని ఆమె కోరారు.



డిసిసి అధ్యక్షుడు రఘునాథ్ రెడ్డిని కలిసిన డైరెక్టర్లు, నాయకులు

## డిసిసి అధ్యక్షుడిని కలిసిన మార్కెట్ కమిటీ డైరెక్టర్లు

**తాండూర్, జూన్ 27, ప్రభాతవార్త :**

బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో శనివారం మార్కెట్ కమిటీ డైరెక్టర్లుగా ప్రమాణ స్వీకారం చేసిన తాండూర్ కు చెందిన కామని శ్రీనివాస్, సాత నాగరాజు మంచిర్యాల డిసిసి అధ్యక్షుడు పిన్నింటి రఘునాథరెడ్డిని కలిశారు. ప్రమాణ స్వీకారం చేసిన మార్కెట్ కమిటీ నూతన డైరెక్టర్లను డీసీసీ అధ్యక్షుడు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. రైతు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కృషి చేయాలని డైరెక్టర్లకు డిసిసి అధ్యక్షుడు సూచించారు. డీసీసీ అధ్యక్షుడిని కలిసిన వారిలో పార్టీ మండల అధ్యక్షులు పెద్దబోయిన శంకర్, నాయకులు మాస వెంకట స్వామి, మోమిన్ అలీ, నవీన్ పటేల్, పెద్దబోయిన రవిందర్, మాసాడి ప్రభాకర్, జావెద్ భాయ్, పున్నం గౌడ్, పప్పీ, మేడి శంకర్ తదితరులు ఉన్నారు.

## చదువే జీవితాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్తుంది

**- గోండుగూడా విద్యార్థులకు చేయూతనిచ్చిన అమ్మ ఆదర్శం యూత్**

**- అమ్మ ఆదర్శం యూత్ సేవలను ప్రశంసించిన ఉపాధ్యాయులు**

**మందమర్రి, జూన్ 26, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా కాసిపేట్ మండలంలోని గోండుగూడా ఎంపీపీఎస్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అమ్మ ఆదర్శం యూత్ ఆధ్వర్యంలో విద్యా సామగ్రి పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, కంపాస్ బాక్సులు, పెన్సిల్లు, పలకలు, బలపాలు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, ఖనువ్వు గౌరవించే స్థాయి నుంచి నిన్ను గౌరవించే స్థాయికి తీసుకెళ్లే శక్తి ఒక్క చదువుకే ఉందిгг అని పేర్కొన్నారు. విద్యార్థులు విద్యపై పూర్తి దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శం యూత్ వ్యవస్థాపకుడు బండారి రవికుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు మంతెన సుమన్, సభ్యులు అందె శ్రీకాంత్, ఆత్రం సంజీవ్ పాల్గొన్నారు. అలాగే ఉపాధ్యాయురాలు శ్రీలత, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని అందించిన అమ్మ ఆదర్శం యూత్ సభ్యులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. విద్యాభివృద్ధికి ఇటువంటి సేవా కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు.

## పదవి చిన్నదైనా మనసు పెద్దది

**- ఆదర్శంగా నిలుస్తున్న వార్డు మెంబర్ రాజన్న**

**చెన్నూరు, జూన్ 27, ప్రభాతవార్త**

ప్రార్థించే పెదవుల కన్నా, సాయం చేసే చేతులు గొప్పవన్న మాటలను నిజం చేస్తున్నాడు చెన్నూరు మండలం ఆస్నాద్ గ్రామానికి చెందిన మూడవ వార్డు సభ్యుడు వడ్లకొండ రాజన్న. తను వార్డులో ఎవరైనా మరణించిన, అనారోగ్యం పాలైన నేనున్నానంటూ తన దయాగుణంతో సహాయం అందిస్తున్నారు. తన పదవి చిన్నదైనప్పటికీ ప్రజలకు చేస్తున్న సేవలను గుర్తించిన గ్రామ ప్రజలు రాజన్నను కొనియాడుతున్నారు. ఆస్నాద్ గ్రామంలోని మూడో వార్డుకు చెందిన తాళ్ల పెల్లి రాజయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా శనివారం 5వ రోజు కావడంతో వార్డు సభ్యులు వడ్లకొండ రాజయ్య వారి కుటుంబ సభ్యులను పరామర్శించి 25 కిలోల బియ్యం అందజేశారు. అనంతరం రాజయ్య కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపినట్లు పేర్కొన్నారు.





## దేవుల్ నాయక్ తాండాలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పర్యటన

### మౌలిక వసతుల కల్పనకు హామీ

**నేరడిగొండ, జూన్ 27, ప్రభాతవార్త:**

నేరడిగొండ మండలంలోని రోల్ మామడ గ్రామ పంచాయతీ పరిధిలో గల దేవుల్ నాయక్ తాండా గ్రామంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శనివారం విస్తృతంగా పర్యటించారు. తాండాలోని ఆడపడుచుల ప్రత్యేక ఆహ్వానం మేరకు గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు గ్రామస్థులు, మహిళలు సాంప్రదాయ నృత్యాలు, మంగళ హారతులతో అత్యంత ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తాండాలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ.. తాండాలో నెలకొన్న పలు సమస్యలను స్వయంగా పరిశీలించానని, వాటన్నింటికీ త్వరలోనే కచ్చితంగా శాశ్వత పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు. తాండాకు కావలసిన అంతర్గత రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు వంటి అన్ని రకాల మౌలిక వసతులను ప్రాధాన్యత క్రమంలో కల్పిస్తామన్నారు. గ్రామస్థుల ప్రధాన కోరిక మేరకు తాండాలో త్వరలోనే కమ్యూనిటీ హాల్ (కమిటీ హాల్) నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని ప్రకటించారు. తాండా ప్రజలందరూ రాజకీయాలకు అతీతంగా, ఐక్యమత్యంతో ఉంటే మరిన్ని నిధులు తెచ్చి అభివృద్ధి కార్యక్రమాలను వేగంగా పూర్తి చేసుకోవచ్చని సూచించారు. తాండా ప్రజలకు తాను ఎల్లప్పుడూ ఒక అన్నగా, అండగా ఉంటానని, నియోజకవర్గ ప్రజలకు ఏ చిన్న సహకారం కావాలన్నా నేరుగా తనను సంప్రదించవచ్చని భరోసా ఇచ్చారు. అర్హులైన ప్రతి ఒక్క పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి తీరుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ రాథోడ్ సజన్, నేరడిగొండ సర్పంచ్ రవీందర్ రెడ్డి, మండల కన్వీనర్ శివారెడ్డి, సర్పంచ్ శంకర్, ఉప సర్పంచ్ నాగేందర్, నేరడిగొండ ఉప సర్పంచ్ గులాబ్, మాజీ సర్పంచ్ గులాబ్, సాబ్లే సంతోష్, నాయక్ మాన్ సింగ్, కరొబారి గణపత్, యాదవ్ రావ్, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, తాండా పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజలందరికీ ఆయురారోగ్యాలు ప్రసాదించాలి

### డా. కొత్తపల్లి శ్రీనివాస్ అనిత దంపతులు

### సత్యనారాయణ స్వామికి వెండి ఆభరణాలు సమర్పణ

**కాగజ్‌నగర్ రూరల్, జూన్ 27, ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రమైన త్రిశూల్ పహాడ్ శ్రీ సత్యనారాయణ స్వామి దేవాలయంలో శనివారం భక్తిశ్రద్ధల నడుమ ప్రత్యేక పూజలు, శ్రీ సత్యనారాయణ స్వామి వారి వ్రతం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులు డా. కొత్తపల్లి శ్రీనివాస్ – డా. కొత్తపల్లి అనిత దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి వెండి కడియాలు, అమ్మవారికి వెండి వడ్డాణం (నడుము పట్టా) ఆభరణాన్ని భక్తిపూర్వకంగా సమర్పించారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య ఆభరణాలను స్వీకరించి ప్రత్యేక ఆశీర్వచనాలు అందించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా డా. కొత్తపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ శ్రీ సత్యనారాయణ స్వామి కృపాకటాక్షాలు మన ప్రాంత ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి ఇంట ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సుఖసంతోషాలు వెల్లివిరియాలని హృదయపూర్వకంగా ప్రార్థించినట్లు తెలిపారు. సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొని ప్రజలందరూ ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. ఈ ఆధ్యాత్మిక వేడుకలో పలువురు ప్రముఖులు, బంధుమిత్రులు, ఆత్మీయులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



# నేడు నిర్మల్‌లో ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ అవగాహన సదస్సు

### ముఖ్య అతిథిగా మంత్రి జూపల్లి కృష్ణారావు

**నిర్మల్, జూన్ 27, ప్రభాతవార్త:**



భారత ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్మల్ జిల్లా కేంద్రంలో విస్తృత అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ కూచాడి శ్రీహరి రావు శనివారం ఈ సదస్సుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. జిల్లా కేంద్రంలోని దివ్య గార్డెన్స్‌లో ఆదివారం ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ సదస్సుకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. నిర్మల్ నియోజకవర్గ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, ఇతర ముఖ్య ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల నాయకులు అందరూ తప్పనిసరిగా హాజరై ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని శ్రీహరి రావు కోరారు. కొత్తగా ఓటర్ల జాబితాలో పేర్ల నమోదు, తప్పుల మార్పులు, చిరునామాల సవరణలపై పార్టీ క్షేత్రస్థాయి శ్రేణులకు పూర్తి స్పష్టత ఇవ్వడమే ఈ సదస్సు ముఖ్య లక్ష్యమని ఆయన తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా జూన్ 25 నుండి ఎస్ఐఆర్ ప్రక్రియ అధికారికంగా ప్రారంభమైన నేపథ్యంలో ఈ అవగాహన సదస్సుకు అత్యంత ప్రాధాన్యత ఏర్పడిందన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఎస్ఐఆర్ నిర్వహణ విషయంలో ఏమాత్రం నిరక్ష్యం వహించినా నేతలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. గ్రామ స్థాయిలో సర్పంచ్‌లు, స్థానిక నాయకులతో కలిసి విస్తృతంగా ప్రచారం నిర్వహించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో పార్టీ శ్రేణులను ఎన్నికల ప్రక్రియకు అనుగుణంగా అప్రమత్తం చేసేందుకు ఈ సదస్సు ఎంతగానో దోహదపడుతుందని శ్రీహరి రావు పేర్కొన్నారు. ఓటర్ల జాబితా సవరణలో పేద ప్రజల పేర్లు గల్లంతైతే వారి ప్రజాస్వామ్య హక్కులకు భంగం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాంటి పొరపాట్లకు తావులేకుండా ప్రతి బూత్ స్థాయి నాయకుడు పూర్తి బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సుకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం నిర్మల్‌లోని కెఎస్ఆర్ (కూచాడి శ్రీహరి రావు) క్యాంప్ ఆఫీస్‌ను సంప్రదించవచ్చని సూచించారు.

# ఎన్‌టిఇపి కింద 5 పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

### జిల్లా వైద్య ఆరోగ్య శాఖ

**నిర్మల్, జూన్ 27, ప్రభాతవార్త:**

జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమం (ఎన్‌టిఇపి) కింద నిర్మల్ జిల్లాలో ఒప్పంద ప్రాతిపదికన ఖాళీగా ఉన్న వివిధ పోస్టుల భర్తీకి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ శనివారం నోటిఫికేషన్ విడుదల చేసింది. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం (ఆర్‌సి.నెం: 01/ఎస్టిటి/2026).. జిల్లా వ్యాప్తంగా మొత్తం 5 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఇందులో 3 ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులు, 2 సీనియర్ ట్యూబర్క్యులోసిస్ ల్యాబొరేటరీ సూపర్‌వైజర్ పోస్టులు ఉన్నాయి. ఈ పోస్టులకు అవసరమైన అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ విద్యార్హత ధ్రువీకరణ పత్రాలపై స్వయం ధృవీకరణ చేసి, దరఖాస్తు ఫారంతో పాటు జతపరచాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను జూలై 6, 2026వ తేదీ సాయంత్రం 5:00 గంటలలోగా నిర్మల్ కలెక్టరేట్ భవనంలోని గది సంఖ్య ఎఫ్ 25లో గల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో అన్ని పనిదినాల్లో సమర్పించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. నిర్దేశిత గడువు దాటిన తర్వాత వచ్చే దరఖాస్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ స్వీకరించబోరని తెలిపారు. ఈ ఉద్యోగాలకు సంబంధించిన అధికారిక దరఖాస్తు ఫారం, విద్యార్హతలు, వయోపరిమితి, పూర్తి మార్గదర్శకాలను నిర్మల్ జిల్లా అధికారిక వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి అభ్యర్థులకు సూచించారు.

## యువకుడు ఆత్మహత్య

**దిలావర్‌పూర్, జూన్ 27, ప్రభాతవార్త:**



నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలం సాంగ్వి గ్రామంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. వ్యక్తిగత కారణాలతో పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ యువకుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సాంగ్వి గ్రామ సర్పంచ్ కొచ్చర్ల భీమవ్వ, భీమేష్ దంపతుల పెద్ద కుమారుడు కొచ్చర్ల వంశీ (22) గురువారం రాత్రి వ్యక్తిగత కారణాలతో మనస్తాపానికి గురై ఇంట్లో ఉన్న పురుగుల మందు సేవించాడు. గమనించిన కుటుంబ సభ్యులు తీవ్ర అస్వస్థతకు గురైన అతడిని తక్షణమే నిర్మల్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. అయితే వంశీ ఆరోగ్య పరిస్థితి మరింత విషమించడంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం నిమిత్తం ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఐసీయూలో అత్యవసర చికిత్స పొందుతూ పరిస్థితి విఫలమై శనివారం ఉదయం వంశీ తుదిశ్వాస విడిచాడు. వంశీ మృతి వార్త తెలియడంతో సాంగ్వి గ్రామంలో ఒక్కసారిగా విషాద ఛాయలు అలముకున్నాయి. చిన్న వయసులోనే, అందరితో ఎంతో కలివిడిగా ఉండే వంశీ అకాల మరణం చెందడాన్ని గ్రామస్థులు జీర్ణించుకోలేకపోతున్నారు. కుటుంబానికి ఆధారంగా నిలవాల్సిన ఇంటి పెద్ద కొడుకు కళ్ల ముందే శవమై పడి ఉండటంతో తల్లిదండ్రులు భీమవ్వ, భీమేష్‌లు గుండెలవిసేలా రోదిస్తున్నారు. వారి ఆవేదన అక్కడి వారిని కన్నీళ్లకు గురి చేసింది. వంశీ భౌతికకాయాన్ని చూసేందుకు బంధువులు, రాజకీయ నాయకులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో సర్పంచ్ నివాసానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. మృతుడి తండ్రి భీమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసుకుని శవపంచనామా అనంతరం దర్యాప్తు చేస్తున్నారు.

## ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

**దండేపల్లి, జూన్ 27, ప్రభాతవార్త**



మంచిర్యాల జిల్లాలోని దండేపల్లి మండలంలోని పరిధిలోని వెల్గనూర్ గ్రామంలో ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యల కారణంగా మనస్తాపం చెంది మెండె పద్మ(45)సంవత్సరాల అనే మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు దండేపల్లి పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం. వెల్గనూర్ గ్రామానికి చెందిన మెండె రాకేష్ ప్రైవేటు ఉద్యోగం చేస్తూ తన తల్లి పద్మతో కలిసి నివసిస్తున్నాడు. గతంలో రాకేష్ తండ్రి, అన్నయ్య మరణించడంతో ఆ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయింది. దీనికి తోడు అప్పుల సమస్యలు ఎక్కువవడంతో పద్మ గత కొంతకాలంగా తీవ్ర మనస్తాపానికి, మానసిక వేదనకు గురైంది. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి 9:00 గంటల ప్రాంతంలో అన్నం తిన్న తర్వాత పద్మ ఇంట్లోకి వెళ్లి పడుకోగా, కుమారుడు రాకేష్ ఇంటి ముందు అరుగుపై నిద్రపోయాడు. శనివారం ఉదయం 6:00 గంటల సమయంలో రాకేష్ నిద్రలేచి తల్లిని ఎంత పిలిచినా లోపలి నుంచి ఎలాంటి సమాధానం రాలేదు. దీంతో అనుమానం వచ్చి కిటికీలోంచి లోపలికి చూడగా, పద్మ ఇంట్లో ఇనుప పైపునకు చీరతో ఉరి వేసుకుని అప్పటికే మృతి చెంది ఉంది. గమనించిన రాకేష్ చుట్టుపక్కల వారి సహాయంతో ఇంటి వెనుక తలుపులు బద్దలుకొట్టి మృతదేహాన్ని కిందికి దించారు. తన తల్లి మరణంపై ఎలాంటి అనుమానాలు లేవని, ఆర్థిక ఇబ్బందుల వల్లే ఆత్మహత్యకు పాల్పడిందని మృతురాలి కుమారుడు రాకేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దండేపల్లి పోలీస్ స్టేషన్ గుండేటి రాజా వర్ధన్ ఎస్సై దండేపల్లి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.